

రేపు లగచర్ల రైతులతో సమావేశం

వికారాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లగచర్ల రైతులతో రేపు సంప్రదింపుల కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ శివారులోని సర్వేనంబర్ 102, 117, 120, 121 అసైండ్ భూమి సర్వే నంబర్ల రైతులతో పరిహారం నిర్ణయించడానికి 13న(గురువారం) కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.



మోదుగు సోయగం

ఆకులు రాలి, అనేక చెట్లు మోడువారగా, మోదుగ చెట్లు మాత్రం నిండుగా ఎర్రటి పూలతో కనువిందు చేస్తున్నాయి. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లకు వెళ్లే మార్గంలో మోదుగ పూల చెట్లు గుత్తులు గుత్తులుగా పూలతో గుబాళిస్తున్నాయి. ఈ పూలను గోగుపూలు, అగ్గిపూలుగా గ్రామాల్లో పిలుస్తుంటారు. శివరాత్రికి ముందు పూచే ఈ మోదుగు పూలు శివునికి అత్యంత ప్రీతికరమని పురాణాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో హోళీ పండగకు మోదుగు పువ్వును ఉడకబెట్టి రంగు తయారు చేసి ఒకరిపై ఒకరు చల్లుకుంటారు. ఈ పూలల్లో ఎన్నో ఔషధ గుణాలుంటాయని, వాటిని ఆయుర్వేద మందుల తయారీలోనూ ఉపయోగిస్తారు.

-దుద్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):

జాతర పోస్టర్ ఆవిష్కరించిన సీఎం

సిడెకు హాజరుకానున్న రేవంత్‌రెడ్డి



పోస్టర్ విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

దుద్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో విడుదల చేశారు. అదే విధంగా దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ సైతం ఈ జాతర పోస్టర్‌ను విడుదల చేశారు. 20 నుంచి ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 21న ప్రధాన ఘట్టం సిడె కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారని ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జయరాములు, నాయకులు మెరుగు వెంకటయ్య, సీసీ వెంకటయ్యగౌడ్, రామకృష్ణారెడ్డి, సంజీవ్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మేడ్చల్ డీఎంహెచ్‌వో



మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారిగా నూతనంగా నియమితులైన ఉమాగౌరి మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మంత్రి దామోదరకు ఫ్లవర్ బోకేను అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా, నేడు(బుధవారం) ఆమె బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం.



ఇంటి నమూనా నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రసాద్ కుమార్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

» శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కుమార్ భరోసానిచ్చారు. మంగళవారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల నమూనా గృహానికి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నేడు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షలు అందిస్తుందన్నారు. ఇంటి స్థలాన్ని బట్టి రెండు విధాలుగా ప్లాన్ ఇవ్వడం జరుగుతందన్నారు. మొదటి విడతలో ఇల్లు లేని నిరపేదలకు, రెండో విడతలతో బండలు, రేకుల ఇళ్లు ఉన్నవారికి మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టీఏ సభ్యులు ఎర్రవల్లిజాఫర్, పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ, అనంత్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

కోట్‌పల్లి: గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం కోట్‌పల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రూ.4.30 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. జిన్నారం, కంకణాలపల్లి, మాల్ శెట్టిపల్లి తండా, రాంపూర్, కొత్తపల్లి, ఎన్నారం, ఎన్కెపల్లి, కరీంపూర్, బార్వాద్, బార్వాద్‌తండా, మద్గుల్ తాండా, మోత్కుపల్లి, నాగసాన్ పల్లి తండా, బీరోల్, గ్రామాలలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పర్యటనలో భాగంగా కోట్‌పల్లి తహసిల్దార్ కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి, సీపీవో అశోక్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో డానియల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్ నాయక్, నాయకులు రాచిరెడ్డి, నర్సిములు, నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ కలకలం

కోళ్లకు వైరస్.. ఆందోళనలో ప్రజలు

- భారీగా తగ్గిన చికెన్ ధర
- జనవరిలో గరిష్ట ధర కిలో రూ.246
- ప్రస్తుతం మార్కెట్‌లో ధర రూ.196
- 18 రోజుల్లోనే రూ.50 తగ్గుదల
- ఉమ్మడి జిల్లాలో మూతపడుతున్న పౌల్ట్రీఫామ్స్



నాన్‌వెజ్ ప్రియులు ఎక్కువగా చికెన్ తినడాన్ని ఇష్టపడతారు. ఇంట్లో కూరగాయలు లేకపోయినా.. సరదాగా ఏదైనా పార్టీ చేసుకోవాలన్నా.. ఆదివారం మాంసాహారం తినాలన్నా.. కోడి కూర వండాల్సిందే. అయితే ఇప్పుడు బర్డ్‌ఫ్లూ కలకలంతో చికెన్ కొనాలన్నా.. తినాలన్నా వామ్మో అంటున్నారు. ఈ వైరస్ పౌల్ట్రీ పరిశ్రమను అతలాకుతలం చేస్తోంది. రెండు రాష్ట్రాల్లోని పౌల్ట్రీ పరిశ్రమను బర్డ్‌ఫ్లూ వణికిస్తోంది. వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకూ వైరస్ విస్తరిస్తున్న తరుణంలో పౌల్ట్రీఫామ్స్ ఒక్కొక్కటిగా మూత పడుతున్నాయి. జిల్లాలో 1,416 పౌల్ట్రీఫామ్స్ ఉండగా, అందులో ఇప్పటికే 20 శాతం వరకు మూత పడ్డాయి.

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వైరస్ పౌల్ట్రీ రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఆరోగ్యంగా ఉన్న కోళ్లు ఉన్నట్టుండి క్షణాల్లో చనిపోవడం రైతులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తుంది. సాధారణ మరణాలకు భిన్నంగా వేలాది కోళ్లు అకస్మాత్తుగా మృత్యువాత పడుతున్నాయి. కోళ్లు మృతి చెందుతుండటంతో ఎగుమతులు, దిగుమతులు భారీగా పడిపోయాయి. దీంతో రైతుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. సాధారణంగా పౌల్ట్రీఫామ్స్‌లో రోజుకు 0.05 శాతం కోళ్లు అనారోగ్యంతో చనిపోవడం సహజమే. అయితే ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అంతు చిక్కని వైరస్ సోకి కోళ్లు చనిపోతున్నాయనే విషయం సోషల్ మీడియాతో జనాలకు తెలియడంతో చికెన్ తినడం మానేశారు. దీంతో చికెన్ ధరలు అమాంతం పడిపోయాయి. ఇప్పటికే ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలో అంతుచిక్కని వైరస్ కోళ్ల పరిశ్రమకు కోలుకోలేని దెబ్బ పడింది. వైరస్‌ను గుర్తించి వెంటనే నిరోధక చర్యలు చేపట్టాలని

మిగతా 7వ పేజీలో...

చికెన్ ధర రూ.లలో

తేదీ	స్కిన్‌తో	స్కిన్ లెస్
ఫిబ్రవరి..		
11	173	196
09	258	180
08	167	190
07	181	206
01	174	198
జనవరి..		
30	190	216
28	199	226
27	206	234
24	216	246

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



పక్క రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాపిస్తుండటంతో మన జిల్లాలోని పౌల్ట్రీ రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలోని పశువైద్యాధికారులు ఇప్పటికే పౌల్ట్రీ రైతులను కలిసి ఫాంలలోని కోళ్లను పరిశీలిస్తున్నాం. కోళ్లు చనిపోయిన చోట శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపించాం. జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని తేలింది. ఇతర వైరస్ కారణంగా కోళ్లు చనిపోతున్నట్లు గుర్తించాం. బాయిలర్ కోళ్లలోనే ప్రస్తుతం సమస్య నెలకొంది. -డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా పశువైద్యాధికారి

నిరంతర విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



వికారాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వేసవిలో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జనవరి 25న విద్యుత్ వినియోగం 7.2ఎంయూ(మిలియన్ యూనిట్లు)గా, ఫిబ్రవరి 1న 310.6 ఎంయూగా రికార్డు అయిందన్నారు. పలు చోట్ల 11 కేవీ ఫీడర్ల పనులు జరుగుతున్నాయని, గ్రామాల్లో లో వోల్టేజీ సమస్యను నివారించేందుకు 1,180 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వేసవిలో 24 గంటల నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సమస్యలు ఉంటే 1912 నంబర్‌లో ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు.


ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

వికారాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం మొదలు కావడంతో అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. మంగళవారం అటవీశాఖ అధికారులతో అనంతగిరి ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీల్లోని మొక్కలకు తగినంత నీరు అందిస్తూ వాటిని రక్షిస్తూ, వర్షకాలంలో నాటేందుకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. 2025-26 సంవత్సరంలో చేయాల్సిన ప్లాంటేషన్స్, పనుల గురించి ఈ సందర్భంగా చర్చించారు. సమావేశంలో ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, ఫారెస్ట్ బీట్ అధికారులు పాల్గొన్నారు.

స్థానిక పోరుకు ఏర్పాట్లు ముమ్మరం

స్టేజ్-1, 2 ఆర్వోలు, ఏఆర్వోలకు ముగిసిన తొలి విడత శిక్షణా తరగతులు

నేడు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఆర్వోలు, ఏఆర్వోలకు.. 15న పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటన



అంబేద్కర్ భవన్‌లో స్టేజ్-2 అధికారులకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

వికారాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికలకు శరవేగంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. పంచాయతీ ఎన్నికల కోసం రూపొందించిన తుది ఓటర్ల జాబితాను అనుసరించి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఓటర్ల జాబితాలను సిద్ధం చేశారు. ఈ ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులను ఉపయోగించనున్న నేపథ్యంలో 700 మంది ఓటర్లకు ఒక బాక్సు చొప్పున సిద్ధం చేశారు. 10న ఎంపీటీసీ స్థానాలు, మండలాల వారీగా ఓటర్ల జాబితాలను మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో అందుబాటులో ఉంచారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మంగళవారం స్టేజ్-1, స్టేజ్-2 అధికారుల శిక్షణా తరగతులు నిర్వహించారు. బుధవారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి 186 మంది రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు మద్గుల్ చిట్టంపల్లిలోని డీపీఆర్‌సీలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు విడుదలైనా సర్వం సంసిద్ధంగా ఉండే విధంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

1,283 పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన

జిల్లాలో 20 మండలాల పరిధిలో 227 ఎంపీటీసీ, 20 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. అన్ని స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు ఎన్నికలకు కలిపి ఒకే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. 11న మంగళవారం పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 227 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నిక నిర్వహించేందుకు 1,283 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పోలింగ్ కేంద్రాల

మిగతా 8వ పేజీలో...

జనరల్ స్థానాల్లో బీసీ మహిళలు పోటీ చేయాలి

తాండూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీ మహిళలు పోటీ చేయాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ సూచించారు. మంగళవారం తాండూరులో జరిగిన బీసీ మహిళ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేసే శక్తి మహిళలకు మాత్రమే ఉందన్నారు. బీసీలు ఓటర్లుగానే మిగిలి పోతున్నారని అగ్ర కులాలే రాజకీయాలలో క్రియశీలకంగా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. బీసీలకు సమాన వాటా దక్కాలంటే పార్టీలు కులమతాలను పక్కను పెట్టి సమష్టిగా ఉద్యమించాలని అన్నారు. రాజ్యాధికార సాధన కోసం ప్రతి మహిళ కృషి చేయాలని కోరారు. జిల్లా బీసీ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మధులత మాట్లాడుతూ బీసీలు అందులో మహిళలు ఐక్యంగా ఉన్నామని చెప్పడానికి ఈ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీసీలను సంఘటితం చేసే శక్తి మహిళలకే ఉందన్నారు. తాండూరు డివిజన్ అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ బీసీ ఉద్యమంలో మహిళలు పాల్గొనాలన్నారు. సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ షకూర్, సంఘం జిల్లా కార్యదర్శి నర్సమ్మ, ఉపాధ్యక్షురాలు మంజుల , విజయలక్ష్మి, బషీరాబాద్, పెద్దేముల్ మండల శాఖ అధ్యక్షురాలు వీరమణి, శివలిల, మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు బస్వరాజ్, లక్ష్మణచారి, తదితరులు పాల్గొన్నారు.



ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న జెడ్పీ సీఈవో కాంతమ్మ

గ్రామీణ ఓటర్లు 66,046

మహిళలకంటే పురుషులే అధికం • జాబితాలను ప్రదర్శించిన అధికారులు

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో కాంతమ , ఆయా మండలాల్లో మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలు ఓటరు జాబితాలను ప్రదర్శించారు. జిల్లా వ్యాప్తంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పాల్గొనే ఓటర్లు 66,046 మంది ఉండగా, వీరిలో పురుషులు 33,150, మహిళలు 32,893 ఇతరులు ముగ్గురు ఉన్నారు. మహిళా ఓటర్లకంటే పురుషులు 250 మంది ఎక్కువగా ఉన్నారు. ఈ జాబితాపై 13వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అభ్యంతరాలను 14న పరిష్కరించి 15న తుది ఓటరు జాబితాను ప్రదర్శిస్తారు. జిల్లాలో మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మూడు మండలాలు మాత్రమే ఉన్నాయి. ఇందులో 19 ఎంపీటీసీలు, 3 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మండలాల వారీగా మేడ్చల్ మండలంలో 22,675, మూడుచింతలపల్లిలో 20,911, శామీర్‌పేట మండలంలో 22,460 మంది చొప్పున ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల కోసం అధికారులు 136 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మేడ్చల్‌లో 48, మూడుచింతలపల్లిలో 43, శామీర్‌పేటలో 45 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిపై 13న ఆయా రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించి అభ్యంతరాలను స్వీకరిస్తారు. వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి 15న తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శిస్తారు.











హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు


మర్పల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 2024 డిసెంబరు 27న మర్పల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో నిందితులకు జీవిత కారాగార శిక్ష, ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తీర్పు చెప్పారని మర్పల్లి ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఘనపూర్ గ్రామానికి చెందిన పట్లోళ్ల సంగమ్మ వలస పోయి ఇస్నాపూర్‌లో ఉంటోంది. గత డిసెంబరు 27న తన బావ పట్లోళ్ల మల్శెట్టి చనిపోవడంతో అంత్యక్రియల కోసం ఘనపూర్‌కు వెళ్లింది. అంత్యక్రియల అనంతరం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు మంట కాపుకోసాగారు. గత సంవత్సరం అమృతం పటేల్ హత్య విషయాన్ని మనసులో ఉంచుకొని గ్రామస్థులు పట్లోళ్ల శ్రీను, మల్లేశం, సలీం, శివయ్య పటేల్‌లు.. సంగమ్మ ఇంటికొచ్చి ఆమె చిన్న కుమారుడు పట్లోళ్ల సురేశ్‌ను ఇంట్లోంచి బయటకు లాగి కత్తులు, రాళ్లతో దాడి చేసి చంపేశారు. ఈ ఘటనపై అప్పట్లో ఎస్సై అరుణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. మోమిన్‌పేట్ సీఐ ఏవీ. రంగ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్‌ను సమర్పించారు. వాదోపవాదాలు విన్న జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఎ-1 పట్లోళ్ల శ్రీనివాస్, ఎ-2 మల్లేశం, ఎ-3 సలీం, ఎ-4 శివయ్యపటేల్‌కు జీవిత కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.వేయి జరిమాన, నిందితులు జరిమానా చెల్లించని పక్షంలో ఆరునెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్సై తెలిపారు. ఈ సంఘటనలో నిందితులకు శిక్ష పడేలా పనిచేసిన పీపీలు సుధాకర్‌రెడ్డి, రవికుమార్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఐఓలు అప్పటి మర్పల్లి ఎస్సై అరుణ్‌కుమార్, మోమిన్‌పేట్ సీఐ ఏవీ రంగ, ప్రస్తుత ఎస్సై సురేశ్, సీఐ నవీన్‌కుమార్, అదనపు సీడీవోలు శ్రీశైలం, బ్రీఫింగ్ ఆఫీసర్ వీరన్నలను జిల్లా ఎస్పీ అభినందించారు.













సౌకర్యాల్లేని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి



డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మల్టీస్పెషాలిటీ పేరుతో కొనసాగుతున్న వికారాబాద్ మెడిక్యూర్, పరిగి సాధన, అలాగే సౌకర్యాల్లేని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇచ్చారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, మల్లేశ్ మాట్లాడారు. రోజుకొక ప్రైవేట్ ఆస్పత్రి పెడుతున్నారని, సౌకర్యాలు కూడా కన్పించకుండా భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. హాస్పిటళ్ల వద్ద పార్కింగ్ సౌకర్యం కూడా లేదన్నారు. ఒక ల్యాబ్‌లో చేసిన పరీక్షల రిపోర్టులు మరో హాస్పిటల్లో తీసుకోవడం లేదని తెలిపారు. వికారాబాద్‌లోని మెడిక్యూర్ ఆస్పత్రికి పార్కింగ్ లేదన్నారు. పరిగి సాధన ఆస్పత్రి ఫుట్‌పాత్‌పై ఉందన్నారు. నాయకులు రాములు, యాదయ్య, నర్సిములు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు



ప్రొఫెసర్లతో ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధి వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై)లో భాగంగా 'రికగ్నిషన్ అఫ్ ప్రయర్ లెర్నింగ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మాసిస్టులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. కెరీర్ అభివృద్ధికి దోహదపడేలా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ డీన్ వసుధభక్తి, శంకర్‌రావు, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు



కులకచర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆవు ఒకే ఈతలో రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. కులకచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామ రైతు గొల్ల నర్సిములుకు చెందిన ఆవు మంగళవారం ఈనింది. సాధారణంగా పాడి పశువులు ఈతలో ఒక్క దూడకే జన్మనిస్తాయి. రెండు లేగ దూడలకు జన్మనివ్వడం అరుదుగా జరుగుతుంది. ఈ ఆవు పెట్టిన రెండు దూడలూ ఆరోగ్యంగా ఉన్నట్లు రైతు తెలిపాడు. స్థానికులు ఆవు వద్దకు వచ్చి దూడలను ఆసక్తిగా తిలకించారు.

విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



భూమి పూజ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తదితరులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట్‌లో బాలుర ప్రాథమిక పాఠశాల వద్ద రూ.61లక్షలతో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. మండలంలోని సర్కారు బడుల అభివృద్ధి, అదనపు గదుల నిర్మాణాన్ని చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జయకృష్ణ, నర్సిములు గౌడ్, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, సంతోష్, కృష్ణ, మల్లికార్జున్, నర్సిములు, అంజిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కాగ్నా గంగాహారతి

తాండూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పౌర్ణమిని పురస్కరించుకొని ఈ నెల 12న కాగ్నానది హారతిని నిర్వహిస్తున్నట్లు ధర్మ జాగారణ సమితి ప్రతినిధులు మంగళవారం తెలిపారు. కోకట్ సమీప వంతెన వద్ద సాయంత్రం 5:30కు అర్చక సంఘం ఆధ్వర్యంలో గంగా హారతి నిర్వహిస్తామన్నారు. గంగ పూజ, కాగ్నా దీపోత్సవం, మహా మంగళ హారతి కార్యక్రమాలుంటాయని తెలిపారు.

ఎక్కడి పనులు అక్కడే..!

- అర్ధంతరంగా నిలిచిన అభివృద్ధి పనులు
- నిధులు విడుదలకాక ముందుకు సాగని వైనం
- ఎనిమిదేళ్లయినా అందుబాటులోకి రాని ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- అరకొర వసతుల మధ్య తహసీల్దార్ కార్యాలయ నిర్వహణ
- పట్టించుకోని అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాలను గాలికొదిలేశారు. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో నిధులు విడుదలకాక పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సర్కారైనా పనులు చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తుందని ఆశించినా ఫలితం లేకుండాపోతోంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తహసీల్దార్ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్, నాగార్జునసాగర్ రహదారిపై స్పాన్ మైనర్ బ్రిడ్జి పనులు ఏళ్ల తరబడిగా నిలిచిపోయాయి. విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఎనిమిదేళ్లుగా అవస్థలే..

ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణాన్ని ప్రారంభించి ఎనిమిదేళ్లవుతున్నా పూర్తికాలేదు. రూ.2.25కోట్లతో 2016లో వినోబానగర్‌లో అప్పటి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంపౌండ్‌కు, ఫర్నిచర్‌కు మరో కోటి ఖర్చవుతుందని అంచనా. 2008 నుంచి డిగ్రీ కాలేజీని ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షిఫ్ట్ విధానంలో నడుపుతున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇంటర్, ఉదయం 11:30నుంచి సాయంత్రం 5:30గంటల వరకు డిగ్రీ తరగతులు నడుస్తున్నాయి. డిగ్రీలో 570 మంది విద్యార్థులున్నారు. డిగ్రీలో రెగ్యులర్, బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో క్రాప్ ప్రొడక్షన్, డెయిరీ సైన్స్ వంటి కోర్సులు ఉన్నాయి. ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ల్యాబ్‌లు, లైబ్రరీకి గదుల్లేక ఒకే గదిలో రెండు ల్యాబ్‌ల చొప్పున నడుపుతున్నారు. స్టాఫ్ రూం లేదు. పరీక్షల నిర్వహణకు కష్టంగా మారింది.

పిల్లర్ల వద్దే నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం

ఇబ్రహీంపట్నం టౌన్‌లో రూ.4.5కోట్లతో చేపట్టిన వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ పిల్లర్ల వద్దే నిలిచిపోయింది. పాత పోలీసు క్వార్టర్స్ స్థలంలో 2022 ఫిబ్రవరిలో నిర్మాణాన్ని మొదలుపెట్టినా ప్రభుత్వం నిధులు విడుదల చేయక పనులు నిలిచాయి. ప్రతి బుధవారం సంతతో అంబేద్కర్ చౌరస్తా మొదలు తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుకిరువైపులా వస్తుసామగ్రి, కూరగాయల వ్యాపారంతో ఇబ్బందిగా మారింది. ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పాత పోలీస్ క్వార్టర్స్ వద్ద రూ.1.06కోట్లతో 36మడిగెలతో కూరగాయల కాంప్లెక్స్ నిర్మాణం చేసినా, అందుబాటులోకి రాలేదు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించని కారణంగా ఈ భవనాన్ని మున్సిపాలిటీకి అప్పగించడం లేదు.



అసంపూర్తిగా తహసీల్దార్ కార్యాలయ భవనం

ఏళ్లయినా పూర్తి చేయకపోతే ఎట్లా?



పెండింగ్ పనుల పూర్తికి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి. ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్లు, ఇతర పనులపై వచ్చేవారు ఆరుబయటే నిల్చోవాల్సి వస్తోంది. తాగు నీరు, టాయ్‌లెట్ల సౌకర్యం కూడా లేదు. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు పూర్తిచేయకపోతే ఎట్లా? ఇప్పటికైనా అధికారులు గుర్తించి నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

- శంకర్‌నాయక్, మాజీ కౌన్సిలర్, ఇబ్రహీంపట్నం

ఒక వైపే బ్రిడ్జి నిర్మాణం పూర్తి

నాగార్జునసాగర్ రహదారి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ వద్ద చేపట్టిన స్పాన్ మైనర్ బ్రిడ్జి నిర్మాణం పనులు ఒకే వైపున పూర్తయ్యాయి. మరో వైపు పనులు చేయక ప్రమాదం పొంచి ఉంది. మూడున్నరేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం చెరువు అలుగు పారి శ్రీఇందూ ఇంజినీరింగ్ కళాశాల కల్వర్టు కొట్టుకుపోయింది. ఈ రహదారిపై రెండువైపులా పది మీటర్ల వెడల్పుతో రూ.3.6కోట్లతో స్పాన్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బిల్లులివ్వక రెండేళ్ల క్రితం ఓ వైపు బ్రిడ్జి స్లాబులువేసి అప్రోచర్స్ వేయలేదు. మరో కాంట్రాక్టరుతో అప్రోచర్స్ పనులు చేయించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఇప్పటికీ బిల్లులు రాక బ్రిడ్జి అంచనా వ్యయం రూ.5.4కోట్లకు పెరిగింది. వర్షాకాలంలో కింది వైపున వాహనాలు వెళ్లడం గగనమే.

నిలిచిన తహసీల్దార్ కార్యాలయ భవనం పనులు

మూడేళ్లకుపైగా తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉన్నాయి. నిజాం జమానా భవనంలో కార్యాలయం కొనసాగింది. శిథిలావస్థకు చేరడంతో ఆ భవనాన్ని కూల్చి 2022 ఫిబ్రవరిలో నిర్మాణ పనులు ప్రారంభించారు. డీఎంఎఫ్ నిధులు రూ.1.25కోట్లతో పనులు చేపట్టగా రెండు స్లాబులు పూర్తయి కొంతమేర గోడలు కట్టారు. నిధులు సరిపోక ఏడాదిన్నరగా పనులు నిలిచిపోయాయి. ఇది పూర్తవడానికి ఇంకా రూ.90లక్షలు అవసరమని అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రస్తుతం పక్కనే ఉన్న పంచాయతీరాజ్ అతిథి భవనంలో నడుస్తోంది. ఈ భవనం సరిపోక ఫైళ్లు నేలపైనే పెడుతున్నారు. వివిధ పనుల కోసం వచ్చేవారు ఆరుబయటే నిల్చోవాల్సి వస్తోంది.

వచ్చే ఏడాది నూతన భవనంలోకి..



డిగ్రీ కళాశాలకు పక్కా భవనం లేక ఇబ్బంది పడుతున్నం. ల్యాబ్‌ల నిర్వహణ కష్టంగా ఉంది. సరిపడా తరగతి గదులు, కనీస వసతులు లేవు. పరీక్షల నిర్వహణకూ ఇబ్బందులే. ఆట స్థలం కూడా లేదు. ఈ విషయమై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఎలక్ట్రికల్ పనులు పూర్తిచేసి ప్రహరీ నిర్మాణం చేయిస్తామని చెప్పారు. పనులు పూర్తయితే వచ్చే విద్యా సంవత్సరంలో కొత్త భవనంలోకి మారతాం.

- డాక్టర్ రాధిక, ప్రిన్సిపాల్, ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల



పిల్లర్ల దశలో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్

అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వం



ముచ్చర్లలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడాది క్రితం అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం అనేక సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటోందేగానీ అభివృద్ధిపై ఏమాత్రం పట్టిం చుకోవడం లేదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారె డ్డి అన్నారు. మంగళవారం ముచ్చర్ల పంచాయతీని సందర్శించి అక్కడి వృద్ధుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వృద్ధులకు నెలకు 4వేల పింఛన్ ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి సంవత్సరం పూర్తయినా పెన్షన్ పెంచకుండా వృద్ధుల ఉసురు పోసుకుంటున్నారన్నారు. దరఖాస్తులు తీసుకున్నారు గానీ సంక్షేమ పథకాలను మంజూరు చేయడం లేదని గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారని ఆమె తెలిపారు.

లక్ష్మయ్య మరణం బీఆర్ఎస్‌కు తీరనిలోటు

ఊట్లపల్లికి చెందిన లక్ష్మయ్య అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. ఎమ్మెల్యే ఆయన మృతదేహానికి నివాళ్లర్పించారు. బీఆర్ఎస్ నాయకుడు మహేష్ తండ్రి లక్ష్మయ్య మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. ఎమ్మెల్యేతో నాయకులు మన్నె జయేందర్, సురేందర్‌రెడ్డి, డి.చంద్రశేఖర్, ఇందిరదేవేందర్, రాములు, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, టి.కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, సామయ్య, దామోదర్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, దేవేందర్, వెంకటేష్‌గౌడ్, నర్సింహ, జంగయ్య, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నర్సింహ, మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హైడ్రా పేరుతో ప్రభుత్వం డ్రామా..

మహేశ్వరం: ఆరు గ్యారెంటీలను పక్కనపెట్టేందుకే ప్రభుత్వం హైడ్రా పేరుతో ఆడుతోందని, రాష్ట్రంలో ఎన్నికలు ఏవైనా గెలుపు బీఆర్ఎస్‌దే అని సబితారెడ్డి అన్నారు. మహేశ్వరం మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదలకు విద్య, వైద్యం, పింఛన్లు, కల్యాణలక్ష్మి, గ్యాస్ సబ్సిడీ, రైతు బీమా పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు రుణమాఫీ చేయలేదన్నారు. కులగణనలో ప్రభుత్వానికి అవగాహన లేదన్నారు. హైడ్రాతో ప్రజలను భయభ్రాంతులకు గురిచే సేందుకేనా కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజు, పాండు, వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, అంబయ్య, వెంకట్‌రెడ్డి, ఎం.నవీన్, ప్రభాకర్‌రెడ్డి, రాయప్ప పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

- 84 కోళ్లు, రూ.30.59లక్షల నగదు, 55 కార్లు స్వాధీనం



పోలీసుల అదుపులో పందెంరాయుళ్లు

మొయినాబాద్: ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఆంధ్రప్రదేశలో సాగిన కోడిపందేలు తెలంగాణకూ పాకాయి. మంగళవారం రాత్రి హైదరాబాద్ శివారులో కోడిపందాల స్థావరంపై పోలీసులు దాడిచేసి పందెంరాయుళ్లను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి తోలుకట్ట సమీప ఫాంహౌస్‌లో మంగళవారం రాత్రి కోడిపందేలను ఏర్పాటు చేశారు. అందిన సమాచారంతో రాజేంద్రనగర్ జోన్ ఎస్వోటీ పోలీసులు, మొయినాబాద్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఏపీకి చెందిన వారు, హైదరాబాద్‌లో సెటిలైన వారు మొత్తం 61మంది కోళ్ల పందాల్లో పాల్గొన్నారు. ముగ్గురు పనివాళ్లు ఉన్నారు. వారి నుంచి రూ.30,59,620నగదు, 55కార్లు, 84పందెం కోళ్లు, 46కోడి కత్తులు, బెట్టింగ్ కాయిన్స్, ప్లేకార్డులను స్వాధీనం చేసుకున్నారు. సంఘటనాస్థలాన్ని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. నిందితులను స్టేషన్‌కు తరలించారు. ఆంధ్రాలో కోడి పందేలు నిర్వహించే వారు చేసిన వ్యక్తులే ఇక్కడ కూడా పందాలు ఏర్పాటు చేశారు.



పంజరాల్లో ఉంచిన పందెం కోళ్లు

బర్డ్‌ఫ్లూ కలకలం

(5వ పేజీ తరువాయి)

రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. వైరస్ సోకిన ఫామ్స్ నుంచి శాంపిల్‌ను ల్యాబ్‌కు పంపామని జిల్లా పశువైద్యాధికారులు చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే.. మాంసం ప్రియులకు చికెన్ దొరకడం కష్టమే! ప్రస్తుతం ధర తగ్గినా మార్కెట్‌లో సరిపడా దొరకని పరిస్థితి ఉంది. వైరస్‌పై పౌల్ట్రీ యజమానులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వైరస్ ఇతర ఫామ్స్‌కు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పశువైద్యాధికారులు కోళ్ల ఫాంలను సందర్శించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

అమాంతం తగ్గిన ధర..

జనవరి 24న చికెన్ ధర స్కిన్‌తో కిలో రూ.216, స్కిన్‌లెస్ రూ.246 ఉండేది. వైరస్ భయంతో చికెన్ డిమాండ్ తగ్గడంతో ధర అమాంతం పడిపోయింది. అమ్మకాలు తగ్గి ప్రస్తుతం విత్ స్కిన్‌తో కిలో రూ.173, స్కిన్ లెస్ రూ.196 ఉంది. కేవలం 18 రోజుల్లోనే కిలోకు 50 రూపాయల చొప్పున తగ్గింది.

3,500కోళ్లు మృత్యువాత పడ్డాయి



గత 15 రోజుల నుంచి కోళ్లు చనిపోతున్నాయి. అంతుచిక్కని వైరస్‌తో ఇప్పటి వరకు 3,500కోళ్లు మృతిచెందాయి. పశువైద్యాధికారులు శాంపిల్స్ తీసుకెళ్లారు. కోళ్ల ఫాం కో సం పెట్టిన పెట్టుబడి కోల్పోయాను. సుమారురూ.4లక్షల వర కు నష్టపోయాను. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి.

- వెంకటయ్య, పౌల్ట్రీ రైతు, చిన్నతూండ్ల, యాచారం మండలం

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



రంగరాజన్‌తో రామస్వామి, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై కొందరు మతోన్మాద శక్తులు దాడిచేయడం సిగ్గుచేటని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి డిమాండ్ చేశారు. రామస్వామి మంగళవారం చిలుకూరు వచ్చి రంగరాజన్‌ను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరైనా ఏ మతంలోనైనా ఉండొచ్చన్నారు. మతం పేరిట దాడులను అరికట్టేందుకు కఠినచట్టాలు రావాలన్నారు. రామస్వామితో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణచారి, అంజయ్య, మల్లేష్, రాములు ఉన్నారు.

పరామర్శించిన సునీతారెడ్డి, భీంభరత్

వికారాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పట్నం సునీతారెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్‌లు రంగరాజన్‌ను పరామర్శించారు. దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు పురాణం వీరభద్రస్వామి, వెంకట్‌రెడ్డి, రాజు ఉన్నారు.




రంగరాజన్‌ను పరామర్శిస్తున్న నర్సింహులు

పూజారిపై దాడి దుర్మార్గ చర్య

షాద్‌నగర్ అర్బన్: చిలుకూరు ఆలయ పూజారి రంగరాజన్‌పై దాడి దుర్మార్గ చర్య అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. చిలుకూరు వెళ్లి రంగరాజన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రాహ్మణులను సమాజం దేవుళ్లగా భావిస్తుందని, అలాంటి వారిపై దాడి అమానుషమన్నారు. రాముడి పేరు చెప్పి దాడి ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి దుర్మార్గులను ప్రభుత్వం శిక్షించాలని నర్సింహులు డిమాండ్ చేశారు. ఆయనతో కుమార్‌గౌడ్ ఉన్నారు.

అనంతగిరి ఘాట్ రోడ్డులో చిరుత

వికారాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో మంగళవారం రాత్రి చిరుత కన్పించింది. అనంతగిరి నుంచి కేరెళ్లి వెళ్లే మార్గంలో ఇటీవలే సిమెంట్ రోడ్డు వేయగా తాజాగా ఆ రోడ్డుపై అధికారులు రాకపోకలను ప్రారంభించారు. మంగళవారం రాత్రి ఘాట్ రోడ్డులో వెళ్తున్న కారుకు ముందుగా చిరుత కన్పించింది. దీంతో కారులోని వారు ఫోన్లలో వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో విషయం బయటకొచ్చింది. అయితే అనంతగిరిలో ఆ దారి గుండా వెళ్లే వారు, అనంతగిరిలోని మెడికల్ కళాశాల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని స్థానికులు పేర్కొంటున్నారు.



అనంతగిరి ఘాట్ రోడ్డుపై కన్పించిన చిరుత

లక్ష్యంతో చదివితేనే ఫలితాలు



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి, మహేందర్

ఆమనగల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిళ్లను అధిగమించి ఏకాగ్రత, పట్టుదలతో ముందుకు సాగితే ఉత్తమఫలితాలు సాధించొచ్చని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్‌చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు మానసిక ఆందోళన చెందకుండా శ్రద్ధతో చదివి మంచి మార్కులతో ఉత్తమ గ్రేడ్‌లు సాంచాలని సూచించారు. ఆమనగల్లులోని శ్రీలక్ష్మీగార్డెన్‌లో మంగళవారం ఫౌండేషన్ సహకారంతో ట్రస్మా ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాలకు చెందిన ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 800మంది టెన్త్ విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. పదో తరగతి విద్యార్థులకు సుంకిరెడ్డి పరీక్షల సామగ్రిని అందజేశారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, వక్త మహేందర్ గురు ఈ సందర్భంగా విద్యార్థులకు పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఉత్తీర్ణత సాధించేందుకు మెలకువలు సూచించారు. సబ్జెక్ట్‌ల వారీగా రోజూ రివిజన్ చేసుకోవాలని చెప్పారు. పరీక్షలు అంటే భయాన్ని వీడి ఏకాగ్రతతో చదివితే పదికి పది గ్రేడ్ సాధించొచ్చని తెలిపారు. విద్యార్థులు టీవీలు, ఫోన్లకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, పరీక్షల సమయంలో సాత్విక పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రాత్రి వేళ ఎక్కువ సమయం మేలుకోవద్దన్నారు. సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానమన్నారు. పేద విద్యార్థులకు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు పాండు, చంప్లానాయక్, ట్రస్మా డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటయ్య, రాష్ట్ర కార్యదర్శి అల్లాజీ గౌడ్, కసిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మహమూద్, శివలింగం, అశోక్‌రెడ్డి, నిరంజన్, శేఖర్, సంజీవ్‌కుమార్, వెంకటేశ్, శ్రీనివాసులు, బీజు, సుధీర్‌రెడ్డి, సువర్ణ గోవర్ధన్‌రెడ్డి, జంగయ్య, మల్లేశ్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల చెల్లించాలి



ఆందోళన చేస్తున్న విద్యాకమిటీ మాజీ చైర్మన్లు

కులకచర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మన ఊరు, మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని విద్యా కమిటీ మాజీ చైర్మన్‌లు కోరారు. మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కార్యాలయం ప్రతినిధికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఊరు, మన బడి కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులు చేపట్టి 20 నెలలు గడుస్తోందన్నారు. కార్యక్రమంలో కులకచర్ల, బొంరెడ్డిపల్లి, ఘనపూర్, దాస్యనాయక్ తండా, ముజాహిద్‌పూర్, రాంరెడ్డిపల్లి తదితర గ్రామాల మాజీ విద్యా కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే అధికం

కులకచర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మండలంలో 12 ఎంపీటీసీ ఓటర్ల జాబితాను ఇటీవల ఎంపీడీవో రామకృష్ణ విడుదల చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 38,413 ఉన్నారు. అందులో 19,123 మంది పురుషులు, 19,286 మహిళలు, ఇతరులు నలుగురు ఉన్నారు. మండల పరిధిలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 163 అధికంగా ఉన్నారు. వీటి ఆధారంగానే అధికారులు రిజర్వేషన్‌లు ఖరారు చేయనున్నారు.

పారదర్శకతకే శిక్షణ : అదనపు కలెక్టర్

వికారాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేందుకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు(ఆర్‌వో), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు(ఏఆర్‌వో(నియోజకవర్గ స్థాయి అధికారులకు స్టేజ్ 1, 2 శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని సుధీర్ హాజరై ప్రారంభించి అధికారులకు సూచనలు సలహాలు అందించారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, బాధ్యతలు, ఎన్నికల సమయాల్లో అనుసరించాల్సిన చర్యలు గురించి అధికారులకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

పెద్దేముల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్ పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం తట్టెపల్లిలో సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని క్రికెట్‌పోటీలు నిర్వహించారు. పోటీలను మంగళవారం ఏబ్లాక్ అధ్యక్షుడు లొంకనర్సిములుతో కలిసి ఆయన ప్రారంభించారు. క్రీడల వల్ల శరీర ధారుఢ్యం అవుతుందని చెప్పారు. అలాగే స్నేహభావం కూడా పెంపొందుతుందని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, మహేష్, విద్యాసాగర్, విష్ణుప్రేమ్, నరేష్ పాల్గొన్నారు.

ఎంపీడీవోలకు సన్మానం



మహేశ్‌బాబును సన్మానిస్తున్న నేతలు

దోమ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దోమ మండల ఎంపీడీవోగా పని చేసి ప్రస్తుతం పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లిన మహేశ్‌బాబు, దోమ ఎంపీవోగా పని చేసి చౌడాపూర్ మండల ఎంపీడీవోగా పదోన్నతిపై వెళ్లిన సోమలింగం, దోమ నూతన ఎంపీడీవో నరేందర్, ఎంపీవో రాజేశ్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంతకుమార్, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్ తదితరులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. తహసీల్దార్ పురుషోత్తం, అధికారులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి వేడుకలకు తరలిరండి

పరిగి,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పరిగిలో నిర్వహించనున్న తాలూకా స్థాయి సేవాలాల్ జయంతి ఉత్సవాలకు గిరిజన సోదరులంతా తరలి రావాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్, మాజీ ఎంపీపీ శాంతిబాయి, ఎంఈవో ఎం.హరిశ్చందర్‌లు కోరారు. సేవాలాల్ ఉత్సవాలపై మంగళవారం పరిగిలోని టీటీడీ కల్యాణ మండపంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. మక్తవెంకటాపూర్‌లో ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించనున్న సంత్‌సేవాలాల్ మహారాజ్, మరియమ్మ యాడీ విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, నాభిశిల ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఎస్టీ సెల్ అధ్యక్షుడు తావుర్యానాయక్, నాయకులు రవినాయక్, గోపాల్, జరుపల శ్రీనివాస్, మోహన్, గోవింద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం

పరిగి,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పరిగి మండలం మిట్టకోడూరులో మాణిక్యప్రభువుల వారి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలుత మాణిక్యప్రభు యజ్ఞకార్యక్రమాలు జరిగాయి. గ్రామస్తులు, భక్తులు యజ్ఞంలో పాల్గొన్నారు. ప్రభువును దర్శించుకుని మొక్కులు తీర్చారు. బుధవారం ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయ స్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శామీర్‌పేటలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద గాజుల పెద్దులు జ్ఞాపకార్థం ఆయన సతీమణి పెంటమ్మ, కుమారులు, కోడళ్లు సత్యనారాయణ- రాధ, శ్రీనివాస్- జ్యోతి, ప్రవీణ్ కుమార్- కీర్తి దంపతులు, కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం

- ఘనంగా వేణుగోపాల స్వామివారి వివాహ మహోత్సవం
- జనసంద్రమైన ఎదులాబాద్



భక్తులకు మంగళసూత్రం చూపుతున్న వేదపండితులు, కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఎదులాబాద్‌కు భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అమ్మవార్లకు, స్వామివారికి పట్టువస్త్రాలు సమరించారు. అనంతరం అమ్మవారి గుణాలను వివరిస్తూ మంగళసూత్రాన్ని భక్తులకు చూపించి మాంగల్యధారణ జరిపించారు. అమ్మవార్లకు, స్వామివారికి తలంబ్రాలు పోసి క్రతువు ముగించారు. అమ్మవారికి భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు. అనంతరం దేవతామూర్తులను ఊరేగించారు. ఎదులాబాద్‌కు చెందిన గోపతి రాజేష్, కుయ్యు వెంకటేష్‌లు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంబారిపేట వంశస్తులు, గ్రామస్తులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే మల్లారెడ్డి



ప్రాసెసింగ్ యూనిట్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : రైతును రాజుగా చేసినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పూడూరులో రూ. 4.70 కోట్లతో నిర్మాణం చేపట్టిన కూరగాయలు, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరానికి ఎంతో చేరువలో ఉన్న మేడ్చల్ నియోజకవర్గంలో కూరగాయలు, పండ్ల ప్రాసెసింగ్ ద్వారా రైతులకు మేలు కలుగుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూరగాయలు, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ భవనానికి భూమి పూజ జరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, పూడూరు సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మేడ్చల్ సొసైటీ చైర్మన్ రణదీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాబు యాదవ్, సొసైటీ డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి) : రాబోయే పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికారులకు తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ శిక్షణ అందించారు. మంగళవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షకుల ద్వారా స్టేజీ-1 రిటర్నింగ్ అధికారులు, స్టేజీ-2 అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి పత్రాల్లో నామినేషన్ స్వీకరించే ముందు ఎలాంటి పొరపాట్లు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల కరదీపిక అందజేశారు. క్షుష్టంగా చదివి ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల

శామీర్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : శామీర్‌పేట మండలం వివిధ గ్రామాల ఎంపీటీసీల పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదలైంది. మంగళవారం మండల పరిషత్ నోటీసు బోర్డులో దాన్ని ఎంపీడీవో మమతాబాయి ప్రదర్శించారు.

ఓటర్లు 31,202 మంది

పరిగి,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా విడుదలైంది. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈ ప్రతులను ఎంపీడీవో కరీం విడుదల చేశారు. మునిసిపల్‌లో విలీనమైన పంచాయతీలు పోనూ మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 11 ఎంపీటీసీ స్థానాల పరిధిలోని 31,202 మంది ఓటరు ఉన్నారని, వారిలో 15,534 మంది పురుషులు, 15,667 మంది మహిళలు ఉన్నారని తెలిపారు.

60 పోలింగ్ కేంద్రాల గుర్తింపు

కులకచర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని 12 ఎంపీటీసీల పరిధిలో 60 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఎంపీటీసీల వారీగా పోలింగ్ బూత్‌ల వివరాలు ప్రచురించారు. పటేల్ చెరువు తండా పరిధిలో 6 పోలింగ్ కేంద్రాలు, ముజాహిద్‌పూర్‌లో 5, కామునిపల్లిలో 5, తిరుమలాపూర్‌లో 4, కులకచర్లలో 6, బండ వెల్కిచర్లలో 4, సాల్విడ్‌లో 8, ఘనపూర్‌లో 4, అంతారంలో 4, ఇప్పాయిపల్లిలో 5, కుసుమ సముద్రంలో 5, పుట్టపహాడ్‌లో 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

పూడూరు, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి) : దత్తత గ్రామాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి. సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పూడూరు మండలం సోమన్‌గుర్తి, దేవనోనిగూడ గ్రామాలను దత్తత తీసుకుంది. మంగళవారం రూ.7లక్షలతో సోమన్‌గుర్తిలో, రూ.6లక్షలతో దేవనోనిగూడలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామస్తులతో కలిసి కంపెనీ ఎగ్జిక్యూటివ్ ప్రారంభించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, కాల్వలు, పూడిక తీత, చెక్‌డ్యాం, రైతులకు ఎరువులు, హెల్త్ క్యాంప్‌లు, స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. అనపురపు సురేష్, సీతారాంరెడ్డి, దేవనోనిగూడ మాజీ సర్పంచ్ బిచ్చన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

లలిత కళలపై మక్కువ చూపాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి(11): లలిత కళలపై మక్కువ చూపాలని ప్రముఖ మధుబని చిత్రకారుడు చంద్రభూషణ్ అన్నారు. ఎదులాబాద్‌లోని తెలంగాణ ఫైన్‌ఆర్ట్స్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో మంగళవారం మధుబని చిత్రకళపై వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి చంద్రభూషణ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఆయన మాటాడుతూ విద్యార్థులు చదువుతో పాటు లలిత కళలపై ఆసక్తి చూపాలన్నారు. మూడురోజుల పాటు లలిత కళలపై వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు.

• ఘనంగా బోనాల ఊరేగింపు



తాండూరు మండలం ఓగీపూర్‌లో రక్తమైసమ్మ దేవాలయం 3వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత బోనాలతో మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని మొక్కుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులతో కలిసి తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి.. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాండూరు రూరల్, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి)

బెల్టు షాపు తొలగించాలి

- కలెక్టర్‌కు కొత్లాపూర్ గ్రామస్తుల వినతి



కొత్లాపూర్‌లో నిర్వహిస్తున్న బెల్టు షాపు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామ నడిబొడ్డున ఏర్పాటు చేసిన బెల్టుషాపును వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామానికి చెందిన కుర్వ సురేష్‌కుమార్ అనే వ్యక్తి గ్రామ నడిబొడ్డులో కిరాణా, బెల్టు షాపు నిర్వహిస్తున్నాడన్నారు. రాత్రివేళల్లో మందుబాబులు పక్కనున్న స్కూల్ ఆవరణలో కూర్చొని మద్యం తాగి సీసాలు ఇక్కడే పడేస్తున్నారని, మూత్రవిసర్జన సైతం చేస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు బెల్టుషాపునకు అనుకొని ఉన్న క్రీడా ప్రాంగణంలో విద్యార్థులకు ఆటలు ఆడితే బంతి లోపలికి వస్తుందని వారిని అసభ్య పదజాలంతో తిడుతున్నారని వాపోయారు. ఆ మేరకు నిర్వాహకుడు సురేష్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) వరం లాంటిదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట్ మండలం ఏర్పుమళ్లకు చెందిన చంద్రయ్యకు మంజూరైన రూ.29వేలు చెక్కును మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఎల్లప్పగౌడ్, చిన్ననర్సిములు, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, పెద్ద సత్తయ్యగౌడ్, అంజిలయ్య పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో రాణించాలి



స్వీట్ హౌస్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్

వికారాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ఒక రంగాన్ని ఎంచుకొని వ్యాపార రంగంలో ముందడుగు వేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రామయ్యగూడ రోడ్డులో నూతనంగా ప్రారంభించిన న్యూ బాలాజీ దేవరాజ్ స్వీట్ హౌస్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ పాల్గొనగా వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



స్నేహితుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కులకచర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడైన స్నేహితుడికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించి దయగుణాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. దోమ మండలం బండవెల్కిచర్లకు చెందిన మొగులోజితో కలిసి 1992-93లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఇంటికి వెళ్లి రూ.50వేలు ఆర్థిక సహాయం అందించారు. అతను ఈ మధ్య కాలంలో హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అనారోగ్యానికి గురికాగా వైద్యులు.. అతని కుడికాలు తొలగించారు. పరామర్శించిన వారిలో పీరంపల్లి రాజు, కృష్ణయ్యగౌడ్, ఆనంద్, శ్రీనివాస్, సత్యం, మల్లేశ్, గోపాల్‌రెడ్డి, రాములు, మొగులయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

వికారాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బీటెక్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గంగారం ప్రాంతానికి చెందిన శాలిని(18) ఇబ్రహీంపట్నంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. రెండు నెలల నుంచి శాలిని తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్నట్లుగా తెలుస్తోంది. ఆమెను కళాశాల నుంచి తల్లిదండ్రులు ఇటీవలే ఇంటికి తీసుకురాగా మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోఫా షాపులో అగ్ని ప్రమాదం

తాండూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తాండూరులోని ఓ సోఫా రిపేరు షాపులో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివాజీ చౌక్ నుంచి మల్‌రెడ్డిపల్లి వెళ్లే రోడ్డులో మహమ్మద్ అబ్దుల్ రెహమాన్ సోఫా ఫర్నిచర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం దుకాణంలో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు. షాపు యజమానికి సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలిసింది.

స్థానిక పోరుకు ఏర్పాట్లు ముమ్మరం

(5వ పేజీ తరువాయి)

ముసాయిదా ప్రకటనకు సంబంధించిన అభ్యంతరాలను 13వ తేదీ వరకు స్వీకరించి 14న అభ్యంతరాలను పరిష్కరించనున్నారు. 15న తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 1,400 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా, ఈ ఎన్నికల్లో 700 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. అంతకంటే 100 మంది వరకు ఓటర్లు అధికంగా ఉన్నా అదే కేంద్రంలోనే ఓటు వేసేందుకు అవకాశం కల్పించనున్నారు.

ఇప్పటికే మొదటి దశ శిక్షణ పూర్తి

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు మండలానికి ఒక నోడల్ అధికారిని నియమించారు. ఎన్నికల నిర్వహణ అధికారులకు శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి స్టేజ్-1లో 205 మంది రిటర్నింగ్ అధికారులు, వీరికి సహాయకులుగా 171 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించారు. జిల్లాలో 594 మందిని స్టేజ్ -2 అధికారులుగా ఎంపిక చేయగా, వారందరికీ మంగళవారం శిక్షణ ఇచ్చారు. జిల్లాలో 594 పంచాయతీల పరిధిలో 5,058 వార్డులు ఉండగా, ప్రతి వార్డుకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి



మెమొరాండం అందజేస్తున్న సభ్యులు

యాలాల, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల్లో కొందరికి ఆరోగ్య సమస్యలు, మెడికల్ గ్రౌండ్స్‌లో ఉన్న వారు కూడా పంచాయతీ ఎన్ని కల డ్యూటీలు వేశారని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి చెప్పారు. వీరికి మినహాయింపు ఇవ్వాలని యాలాల ఎంపీడీవో పుష్పలీలకు మెమొరాండం అందజేశారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల జీహెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు స్టేజ్-1, స్టేజ్-2 ఆఫీసర్ రెండు డ్యూటీలు కేటాయించారని తెలిపారు.

జిల్లాలో నేడు

ఎల్మకన్నె గోదాం ప్రారంభం



ప్రాథమిక సహకార సంఘం గోదాం

తాండూరు రూరల్, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి) : తాండూరు మండలం అల్లాపూర్ గ్రామ శివారులోని ఎల్మకన్నె సహకార సంఘం గోదాం బుధవారం ప్రారంభిస్తున్నామని ఎల్మకన్నె పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్, అడిషనల్ సీఈవో చంద్రారెడ్డిలు తెలిపారు. గ్రామ శివారులో రెవెన్యూ శాఖ గోదాం నిర్మాణానికి ఎకరా 30 గుంటల భూమిని కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఉదయం 11 గంటలకు గోదాంను ఎల్మకన్నె సహకార సంఘం చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో తాండూరు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తామని వివరించారు.


కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

తాండూరు రూరల్, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు జెర్నె నాగప్ప మంగళవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ఎల్మకన్నె పీఏసీఎస్ సమీపంలోని నూతనంగా నిర్మించిన గోదాంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

నీటి సరఫరాలో అంతరాయం

దుద్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంతో పాటు బొంరాస్‌పేట్ మండలంలో ఉన్న ఐదు గ్రామాలకు బుధవారం మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సాయినాథ్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. కొడంగల్ హైవే పోలీస్‌స్టేషన్ నుంచి నాజ్‌ఖాన్‌పల్లి ప్రధాన రహదారిలో రోడ్డు పనులు జరుగుతున్నాయని, పైపులైన్‌లు దెబ్బతిన్నాయని తెలిపారు. దీంతో దుద్యాల మండలంలోని గ్రామాలకు, బొంరాస్‌పేట్ మండలంలోని లింగన్‌పల్లి, బాపల్లి తండా, ఏర్పుమళ్ల, మేడిచెట్టు తండా, నాందర్‌పూర్ గ్రామాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అధికారులకు అవగాహన కార్యక్రమం



శిక్షణలో అధికారులు

పరిగి,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన కల్గి ఉండాలని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర అన్నారు. స్థానిక సంస్థలకు సంబంధించి పరిగి, పూడూరు, దోమ, కులుచర్ల, చౌడాపూర్ మండలాల్లోని స్టేజీ-1, స్టేజీ-2 అధికారులకు మంగళవారం పరిగి మండలం నస్కల్ రైతువేదికలో శిక్షణ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా సిద్ధంగా ఉండాలని సూచించారు. డీపీవో జయసుధ, ఏపీడీవోలు, టీవోటీలు పాల్గొన్నారు.